# చంద్రహారం

— చెళ్లూరి సీతారాజేశ్వరరావు



కధా నిలయం

రాత్రి భోజనమయ్యాక బెడ్రూంలో సిగరెట్టు కాలుస్తూ విశ్రాంతిగా కూర్చు న్నాను. శ్రీమతి వంటిల్లు సర్దుకుని వచ్చి, తాంబూలం యిచ్చింది.

"నా మతిమండా! మీకు చూపించనే లేదు. సాయంత్రం కంసాలి వచ్చినగయిచ్చాడు." ఆమె గాద్రెజ్ బీరువా దగ్గరకెళ్ళింది. తాళం చెవులు దానికే వ్రేలాడుతున్నాయి. బీరువా తీసి నా దగ్గరకొచ్చింది.

చంద్రహారం!

దాన్ని చూడగానే నాకు సిగ్గు, అవమానం, కోపం ముంచెత్తుకొచ్చాయి. ఏం మాట్లాడలేక చూస్తూ కూర్చున్నాను- పరీక్షిస్తున్నట్లు.

సరిగ్గా నెల క్రితం....

మాది ఏటి ఒడ్డున చేనులాంటి సంసారం. దేనికీ లోటు లేదు. పిత్రార్జితమైన ఇరవై ఎకరాలు, డాబా యిల్లు, ధాన్యం వ్యాపారం వున్నాయి. అందుకే బియ్యే ప్యాసయినా వుద్యోగాలకి పోకుండా ఉన్నది చూసుకుంటూ వస్తున్నాను. అందరూ నన్ను అదృష్టవంతు డంటారు.

అదీ నిజమే. సిరీ-సంపదా, అనుకూలవతియైన భార్యా, ముగ్గురు ముత్యాల లాంటి పిల్లలూ, రచయితగా సమాజంలో గౌరవం... నా జీవిత విధానం నాకు పూర్తిగా తృప్తినిస్తున్నది.

విజయవాడ నుంచి ఒక ప్రొడ్యూసర్ కథ కావాలని, వెంటనే వచ్చి కలవమని వుత్తరం రాశాడు. నా పనుల ధోరణివల్ల కదల్లేదు. ఓ నాటి మధ్యాహ్నం అతడి దగ్గర్నుంచే టెలిగ్రాం వచ్చింది. ఇక బయలుదేరక తప్ప లేదు.

సూట్ కేస్‌లో బట్టలు సరుకుని రిక్షాలో జగ్గన్న పేట వచ్చేసరికి మూడున్నరయింది. రాజోలు—హైద్రాబాదు బస్సు మరో అర గంటలో వస్తుంది. దాని కయితే సుఖంగా ప్రయాణం చేయవచ్చును. తొమ్మిదిన్నరకల్లా విజయవాడలో దిగవచ్చును. నాకూ ప్రయాణా లంటే సరదానే!

బస్సు అంత రష్‌గా లేదు. టిక్కెట్టు తీసుకుని విండో దగ్గరగా కూర్చున్నాను.

విజయవాడలో బస్సు దిగి ప్రక్కనే వున్న హోటల్‌కి వెళ్ళాను గదికోసం. ఖాళీ లేదు. దాని ప్రక్క హోటల్లో కూడా అడిగాను. "లేవు సార్!" అన్నాడు కౌంటర్‌లో గుమాస్తా.

రోడ్డుమీదకి వచ్చేసరికి రిక్షా వాళ్ళు ఈగల్లా ముసిరేశారు. నాకు చాలా చిరాకనిపించింది. ఇరవై గజాలు పోయి ఓ రిక్షా ఎక్కాను. వాడు లాడ్జింగ్ హౌస్‌లు తిప్ప సాగాడు. పది గుమ్మాలయినా ఎక్కి దిగి వుంటాము. చివరకి గవర్నరు పేట లోని చవుకరకం లాడ్జింగ్‌లో గది దొరికింది. ఆ వాతావరణం చూడగానే అక్కడ వుండటం ఎలాగనిపించింది. కాని అప్పటికే పదకొండు గంట లయింది.

ఇక తిరిగే ఓపిక లేదు. సూట్ కేస్ గదిలోపెట్టి నా తాళం గదికి వేసి బజారులోకి వచ్చాను. భోజన హోటళ్ళు కట్టివేశారు.

కాకా హోటల్‌లో టిఫిన్, టీ

తీసుకుని గదికి చేరుకున్నాను. గదంతా ఏదో మురికివాసన. అగరు వత్తులు వెలిగించాను. ఎప్పటికో కునుకు వచ్చింది.

అయిదింటికే మెలకువ వచ్చే సింది. స్నానం వగైరాలు పూర్తి చేసుకుని దుర్గ గుడికి వెళ్ళాను. దర్శనమయి కొండ దిగేసరికి ఏడయింది. బ్యారేజీ దగ్గరకి వచ్చి రిక్షా ఎక్కాను- ప్రొఫెసర్ని కలవడానికి.

రిక్షా సత్యనారాయణ పురం చేరుకుంది. ఆయన యిల్లు గుర్తు పట్టడం పెద్ద కష్టం కాలేదు. కాని గేటుకి తాళం వేసి వుంది. వంగి చూడగా ఇంటికికూడా తాళం కన పడింది. 'నా శ్రమ అంతా వృధా యేనా? నన్ను రమ్మని ఎక్కడికి పోయినట్లు? ఏం చేద్దామని గేటు దగ్గర తచ్చాడుతున్నాను?'

"శివజ్ఞానం గారి కోసమా? ఫ్యామిలీ మద్రాసు పెళ్ళికి వెళ్ళింది. ఆయన మాత్రం రంగసూరి గారి యింటిదగ్గర వుంటారు." నన్ను చూసి ఓ యువకుడు వచ్చాడు.

అతడి పేరు జోగారావని తెల్సుకుని, "ఆయన యిల్లుఎక్కడ? దయచేసి చూపిస్తారా?" అనడిగాను.

"రండి. నేను అటే పోతు న్నాను."

రిక్షా పిలవబోయాను. "వద్దు సార్! దగ్గరే.... ఆ సందు తిరిగితే రంగసూరి గారిల్లు." జోగారావు వారించాడు.

ఇద్దరం నడుస్తున్నాం. నాకు దిక్కులు చూస్తూ నడవడం అల వాటు. కాలికి ఏవో తగిలింది. చిన్న అట్టపెట్టె తీశాను. ఎర్ర రంగు కాగితానికి బంగారం ముద్దగా చుట్ట బడి వుంది. జోగారావు కూడా వంగి చూశాడు.

"అదృష్ట వంతులు సార్! మూడు తులాలకి తక్కువ వుండదు. అదృష్టం వున్న వాళ్ళనే వరిస్తుంది సార్! నాలాంటి వాడికి దొరక మన్నా దొరకదు. ఇంకా ఏం చూస్తారు సార్! బంగారమే.... ప్యాకెట్టు లోపల పెట్టేయండి. నాలుగు వేల రూపాయిల సొమ్ము." జోగారావు తొందర చేశాడు. అతడి మాటల్లో ఎక్కడా ఈర్ష్యలేక పోవ డం గమనించాను.

ప్యాకెట్టు లోపల పెట్టి నడవ సాగేం. పది గజాల్లో ఒక ముస లాయన- మాసిన తెల్ల గడ్డం, చేతిలో గుజరాత్ సేవింగ్స్ బ్యాగ్ శిధిలావస్థలో వుంది.... కంగారుగా, "అయ్యా! మీకు రోడ్డుమీద ఏద యినా ప్యాకెట్టు దొరికిందా?" అడి గాడు నన్ను.

జోగారావు చెప్పవద్దన్నట్లు నా కాలు తొక్కి ముసలాయనకేసి తిరిగి, "లేదే!" అన్నాడు.

ముసలాయన వ్యథగా చూసి, "అమ్మాయి పెళ్ళికి బంగారం కొన్నాను సార్! సైకిల్ మీదవస్తూ ఓ కుర్రాడు డాష్ యిచ్చాడు. రోడ్డు మీద పడి పోయాను. అప్పుడు పడి పోయి వుంటుంది." జేబులోనుంచి ఆకు పచ్చని కాగితం తీసి యిచ్చాడు.

అది విజయవాడలోని ప్రముఖ బంగారు వ్యాపారస్థుని క్యాష్ బిల్లు రశీదు. నాలుగువేల రెండొందలు చెల్లించబడింది ఆ రోజే.

"పడిపోయిన వస్తువు దొరుకు తుందా తాతగారూ! ఎందుకీ వృథా శ్రమ? యింటికి వెళ్ళి పొండి" అన్నాడు జోగారావు. ముసలాయన సణుగుకుంటూ వెళ్ళి పోయాడు.

"మీ రెక్కడ చెప్తారోనని భయపడి చచ్చాను సార్! మరీ అంత అమాయకత్వం పనికిరాదు. ఎవరి అదృష్టం ఎవరికి వస్తుంది? ఈ కాలానికి మంచి తనం పనికి రాదు సార్! ఇప్పుడు మీ రిచ్చినా ఆ ముసలాడు మళ్ళీ పడేసుకోడని నమ్మకం ఏమిటి?" అన్నాడు జోగారావు.

'నాకు మాత్రం వదులుకోవాలని వుందా? అయినా బంగారంచేదా? అదృష్టం నన్ను వెతుక్కుంటూ వచ్చింది కాబట్టి నాకు దొరికింది.'

"మరొకడయితే సగం ఇమ్మని మిమ్మల్ని ఒత్తిడి చేస్తాడు. కాని నేను అలా చెయ్యను. మీరేదయినా యిస్తే పుచ్చుకుంటాను" అన్నాడు జోగారావు.

జోగారావు మంచివాడులా వున్నాడు. అతడ్ని కాదనడం ఏం బాగుంటుంది? వెయ్యి రూపాయి లిచ్చాను. అతడు సంతోషించాడు.

ప్యాడ్యూసర్ని కల్సుకుని ఆ రాత్రే యింటికివచ్చాను. బంగారం అమ్ముకునే బదులు శ్రీమతికి చంద్ర హారం చేయిస్తే బాగుంటుందని ప్రొద్దుటే కంసాలిని పిలిచాను.

"ఎవరో మిమ్మల్ని మోసం చేశారు. ఇది రోల్డుగోల్డు" అన్నాడు కంసాలి బంగారం చూసి.

"తెలియని చోట ఎలా కొన్నా రండీ?" శ్రీమతి సాధింపు.

జోగారావు ఆ ప్యాకెట్టు తనే పడేసి, ముసలాడితో నాటకం ఆడించి వెయ్యి కొట్టేశాడు. ఇది శ్రీమతికి చెప్పలేక, నవ్వులపాలు కాలేక, నిజం బంగారం కొని చంద్రహారం చేయించాను- "పొట్లాలు మారాయి" అంటూ.

"బాగాలేదా?" శ్రీమతి రెట్టించింది దగ్గరికి జేరి.

"చంద్రహారం కంటె నువ్వు బాగున్నావు" అన్నాను నవ్వు తెచ్చుకుంటూ. *